
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 118 వ భాగం

## పురంజనోపాఖ్యానం 11

వ. అంత విజితాశ్వుండు పరలోకగతుం డయిన హవిర్ధానుండు హవిర్ధాని యను భార్యవలన బర్హిష్మదుండు, గయుండు, శుక్లుండుఁ, గృష్ణుండు, సత్యుండు, జితవ్రతుండు, నను పుత్రుల నార్వురం గాంచె; నందు బర్హిష్మదుండు. [4-679]

వేనుడి నుంచి పృధువు, విజితాశ్వుడు పుట్టాక హవిర్ధానుడి వరకు వచ్చింది వంశం. ఈయనకి హవిర్ధాని అనే భార్య వల్ల ఆరుగురు కొడుకులు పుట్టారు. పెద్దవాడు బర్హిష్మదుడు. ఓ విషయం గమనించండి. తల్లి తండ్రులు ఏం చేస్తారో సాధారణంగా అదే పిల్లలకి అలవడుతుంది కదా? పృధువు చేసిన యజ్ఞాలు విజితాశ్వుడు కూడా జీవితాంతం చేసాడు. అలా ఈయన కొడుకు బర్హిష్మదుడూ అంతే, అయితే కొంచెం ఎక్కువగా చేస్తున్నాడు ఈయన.

సీ. సంతత సవన దీక్షాశాలి యగుచు ధ
రాతలం బెల్లను గ్రతువులకును
విలసిల్లు యజనశాలలు వేఱువేఱ క
ల్పించి యజ్ఞములు గావించుచుండి
చిరకీర్తి యతఁడు ప్రాచీనాగ్రకుశలచే
క్షితితలం బెల్ల నా స్తృతము చేయ
వసుధ యెల్లను యజ్ఞవాటమై విలసిల్ల
సత్క్రియాకాండ నిష్ణాతుఁ డగుచు [4-680]

తే. సుభగయోగ సమాధి నిష్ఠుఁడు ప్రజాప
ति యగునని తన్ను జనము నుతింప వెలయు
నట్టి ఘనుఁడు హవిర్ధాని యఖిల జగతిఁ
బఱపి కుశలను బ్రాచీనబర్హి యయ్యె. [4-680.1]

తండ్రి దీర్ఘ యజ్ఞం చేసాడు కనక ఈయన ఒకటేమిటి అనేక యజ్ఞశాలలు వేరువేరుగా కల్పించి అలా యజ్ఞాలు చేస్తూనే ఉన్నాడు. భూమండలం అంతా దర్భలని పరిపించడం వల్ల ప్రాచీన బర్హి అనే పేరు సంపాదించాడు. ఈ పద్యంలో తూర్పు అనే పదం ఎక్కడుంది చెప్పండి చూద్దాం? ప్రాచీనము – తూర్పు. "ప్రాచీనాగ్ర కుశలచే" అంటే – దర్భల చివరలు తూర్పు దిశలో ఉండేలాగ పరిపించాడు. యజ్ఞం చేసేటపుడు/శుభకార్యాలలో ఇదో పద్ధతి, దర్భలని అలా తూర్పు దిశగా పెట్టి యజ్ఞం చేయిస్తారు. అదే పితృదేవతలకి నీరు వదిలేటపుడు మరో విధంగా పరుస్తారు ఈ దర్భలని. ఎన్నో యాగాలు చేస్తూ ఇలా దర్భలు పరిచాడు కనక ఆయనని ప్రాచీనబర్హి అనే పేరుతో కూడా పిల్చేవారుట.

వ. అట్టి సౌందర్యఖనియు సముద్రపుత్రియు నయిన శతధృతి యను కన్యం బ్రహ్మోదేశంబునం బాణిగ్రహణంబు చేసె; నా శతధృతి వలనం బ్రాచీనబర్హికిఁ బదుగురు కొడుకులు జనియించిరి; వారలు తుల్యనామ వ్రతులును ధర్మపారగులును నయిన ప్రచేతసులు; వారు ప్రజాసర్గంబు నందుఁ దండ్రిచేత నాజ్ఞాపితులయి తపంబు గావింప వనంబునకుం జను సమయంబునం దన్మార్గంబునఁ బ్రసన్నుం డగుచు దృశ్యమానుండైన రుద్రునిచేత నేది యుపదేశింపబడె దాని జపధ్యాన పూజా నియమంబుల సేవించుచుఁ దపఃపతి యైన నారాయణుం బదివేల దివ్యవత్సరంబులు పూజించి;" రని చెప్పిన విని విదురుండు మైత్రేయున కిట్లనియె. [4-684]

ఈయనకి సముద్రుడి కూతురు శతధృతి అనే ఆవిడతో బ్రహ్మ వల్ల ఆదేశం అయ్యి పెళ్ళి అయ్యాక పదిమంది కొడుకులు పుట్టారు. వీళ్ళే ప్రచేతసులు. ప్రాచీనబర్హి ఇన్ని యజ్ఞాలు చేస్తున్నాడు కనక వాళ్ళావిడ పేరు కూడా సమంజసంగా ఉంది చూడండి. శత – వంద, ధృతి – యజ్ఞము. వీరికి పుట్టిన పిల్లలో? తుల్య (సమానమైన) నామ వ్రతులు (వ్రతం, నడవడి కలవారు), ధర్మాన్ని/వేదాన్ని అనుసరించేవారు. వారి పేర్లో? ప్ర (మంచి) చేతస్ (మనసు) కలవారు. వీళ్ళని తండ్రి ఆజ్ఞాపించాడు ప్రజోత్పత్తి చేయండి, అని. అంటే ఏవర్నో ఒకర్ని పెళ్ళి చేసేసుకుని పిల్లల్ని కనడం కాదు. ముందు మనం ఎవరం, ప్రజోత్పత్తి చేయడానికి మనకి భగవంతుడి అనుగ్రహం ఉందా? మనం ఆ పనికి అర్హులమేనా? లేకపోతే పుట్టే జనం వల్ల ఎటువంటి అపాయాలు, ఉత్పాతాలు కలుగుతాయో అనుకుని అన్నింటికీ భగవంతుడే మూలం కనక

ముందు తపస్సు చేయడానికి బయల్దేరారు. కథ తెల్సిందే కదా? సూతుడు చెప్తున్నాడు మిగతావారికి భాగవతం. అందులో శుక మహర్షి పరీక్షిత్తుకి చెప్తున్నట్టూ, అందులో విదురుడు మైత్రేయుణ్ణి కలిసినప్పుడు జరిగిన కథ.

తపస్సు చేయడానికి వెళ్ళే దారిలో వీరికి శివుడు/రుద్రుడు కనిపించి దీక్ష ఇచ్చాడు. ఆ దీక్ష పట్టుకుని పదివేల దివ్య సంవత్సరాలు శ్రీహరిని పూజించారు. రెండు ప్రశ్నలు ఉదయిస్తాయి ఇది చదివితే. శివుడు వీళ్లకి ఎందుకు కనిపించి దీక్ష ఇచ్చాడు? రెండోది, అన్నేళ్ళు పూజించాలా శ్రీహరి కృపకి? ముందు రెండోదానికి సమాధానం చూద్దాం. కుబేరుడు కొడుకులైన నలకూబర మణిగ్రీవులనేవారు (గుహ్యకులు) కూడా ఉన్న అప్సరసలతో జలకాలు ఆడుతుంటే నారదుడు అటువేపు వస్తాడు. వీళ్ళకి కళ్ళు నెత్తిమీదకి ఎక్కాయి కనక సిగ్గు అనేది లేకుండా అలాగే ఈయనని గేలి చేయడానికి ప్రయత్నం చేసినపుడు ఆయన శపిస్తాడు – "ఇప్పుడు దిగంబరంగా ఉన్నట్టే పదివేల దివ్య సంవత్సరాలు చలికీ ఎండకీ, వానకీ ఓడుతూ మద్ది చెట్లగా పడి ఉండండి," అని. వంటి మీదకి తెలివి వచ్చి శాప విమోచనం కోరితే అప్పుడు చెప్తాడు మహర్షి. "ఈ పదివేల దివ్య సంవత్సరాలూ కూడా నారాయణమంత్రం జపిస్తూ ఉండండి, అలా కృష్ణావతారంలో మీకు శాపవిమోచనం అవుతుంది," అని. మనసు పూర్తిగా నిర్మలం అవాలంటే నిరంతరం భగవన్నామం తప్పనిసరి (యజ్ఞానాం జపయజ్ఞోస్మి... భగవద్గీత) . అందుకే ప్రచేతసులు అన్ని సంవత్సరాలు తపస్సు చేసారని అర్థం చేసుకోవచ్చు. అదీగాక భగవంతుడు అంత సులభంగా అందరికీ కనిపిస్తాడా? ఆయన కోసం నిరంతరం తల్చుకుంటూ కంసుడిలాగానో, హిరణ్యకశిపుడిలాగానో ఉండగలగాలి. మద్దిచెట్లైన గుహ్యకులకి శాపవిమోచనం అయ్యాక వెళ్ళిపోతూ ఈ కోరిక కోరుకుంటారు కృష్ణుణ్ణి, మరోసారి భగవంతుణ్ణి మర్చిపోకుండా ఉండడానికి. అది పోతన ఎంత అద్భుతంగా రాసాడో చూడండి. అలా అన్ని ఇంద్రియాలని భగవంతుడి మీద ఉంచగలిగినప్పుడు మాత్రమే కనిపిస్తాడు.

శా. నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీ పేరం బనిచేయు హస్తయుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్
నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్
నీ పై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా!" [10.1-408]

అయితే ప్రచేసులకి రుద్రుడు అంత సులభంగా ఎందుకు కనిపించాడు, మంత్రం ఉపదేశించి దీక్ష ఇచ్చాడనేది విదురుడు మైత్రేయుణ్ణి అడుగుతున్నాడు. అది కింద పద్యంలో చూద్దాం. జాగ్రత్తగా చదివితే మనకి పోతనలో ఉన్న శివభక్తుడు కొట్టొచ్చినట్టూ కనిపిస్తాడు.

సీ. తాపసోత్తమ! ప్రచేతసులకు నా వన-
మార్గంబునందు నా భర్గుతోడ
సంగ మెట్లయ్యెఁ? బ్రసన్నుఁడై హరుఁ డెద్ది-
తివుట వారల కుపదేశ మిచ్చె?
జీవరాశులకు నా శివుతోడి సంగంబు-
గడు దుర్లభం; బీ జగంబు నందుఁ
జర్చింప నమ్మేటి సన్మునీంద్రులకును-
సంచితధ్యానగోచరుఁడు గాని [4-685]

తే. పుడమిఁ బ్రత్యక్షమునఁ గానఁబడఁడు; మఱియు
నంచితాత్మ సదారాముఁ డఖిల లోక
రక్షణార్థంబుగా విరూపాక్షుఁ డాత్మ
శక్తితోఁ గూడి జగతిపై సంచరించు. [4-685.1]

క. కావున భగవంతుండును
దేవాధీశుండు నయిన దేవుని సంగం
బే వెరవున ఘటియించెనొ
యా విధ మంతయును దెలియ నానతి యీవే. [4-686]

ప్రచేతసులకి శివుడు ఎలా కనిపించాడు? కనిపించినా ఉపదేశం ఇవ్వడం ఎలా జరిగింది? మామూలుగా ఎవరికైనా పరమేశ్వరుడు కనిపించడం అనే అతి దుర్లభం కదా? ఎంతో తపస్సు చేస్తే ధ్యానంలో కానీ కనిపించని శివుడు, భూమిమీద ఏ రూపంలోనూ కనిపించనివాడు, ఆత్మశక్తితో (తన భార్య అయిన పార్వతితో) లోకాలని సంరక్షించడానికి సంచరించేవాడు కదా? ఈ పద్యంలో పోతన శివుణ్ణి ఏమన్నాడో గమనించారా? సదారాముడు; సదా – నిరంతరం, ఆరాముడు – ఆనందంగా ఉండేవాడు.

తే. శశికరంబులు౯ బోలి విశదము లగుచు
హరికథలఁ బోలి కల్మషహరము లగుచు
వహ్నులును బోలి భువన పావనము లగుచుఁ
బొగడఁ దగు నీరములచేఁ బ్రపూర్ణ మగుచు. [4-691]

వ. ఒప్పునట్టి సరోవరంబుఁ బొడగని యందు నొక్క దివ్యపురుషునిం గని; రతండును. [4-692]

దీనికి మైత్రేయ మహర్షి సమాధానం చెప్తున్నాడు. ఈ ప్రచేతసులు వెళ్ళేదారిలో మంచి నీటితో కనిపించే ఓ సరస్సు (సరోవరం) కనిపించింది. అందులోంచి ఒక దివ్య పురుషుడు బయటకి వచ్చి కనిపించాడు. ఎలా?

మ. కని రా తాపస పుంగవుల్ దివిజలోకశ్రేష్ఠునిం దప్తకాం
చన వర్ణున్ సనకాది యోగిజన భాస్వద్గీయమానుం ద్రిలో
చను భక్తానుగుణానుగున్ సుమహితైశ్వర్యుం బ్రసాదాభిశో
భనవక్త్రున్ నిహతాఘకర్తృజనసంపద్భద్రునిన్ రుద్రునిన్. [4-695]

దివిజ (దేవ) లోక శ్రేష్టుడు, పుటం (తప్త) పెట్టిన బంగారం (కాంచన) రంగులో ఉండేవాణ్ణి, సనక సనందాది మునులచే కీర్తించబడేవాడిని భాస్వద్ – ప్రకటముగా, గీయమానున్ – కీర్తించబడేవాడు, నిహత – పోగొట్టే, అఘ – పాపం, కర్తృ – కలగజేసే, జన – జనాలకి, సంపద్భద్రునిన్ – క్షేమం చేకూర్చేవాడు (నిహతాఘకర్తృజనసంపద్భద్రునిన్) అయిన రుద్రుడు కనిపించాడు. ఈ పద్యం కూడా నాలిక తడబడకుండా చదవడం అసాధ్యం.

వ. భగవంతుండును నఖిల ధర్ముండును గృపాళుండును భక్తవత్సలుం డును నఖిల పాపహరుండును నయిన హరుండు ప్రీతుం డగుచుం బ్రసన్నాంతఃకరణులు ధర్మజ్ఞులు శీలసంపన్నులు సంప్రీతులు నయిన వారల కిట్లనియె. [4-697]

ఇలా రుద్రుడు కనపడగానే వీళ్ళు పాదనమస్కారం చేసారు. దానికి ఆయన – భగవంతుడు, [హరిహరాదులకి భేధం లేదని చెప్తున్నాడు పోతన పరోక్షంగా] కృపాళువు, భక్తులని అతి సులభంగా కరుణించేవాడు, ఎటువంటి పాపాలనైనా హరించగలవాడు అయిన, శివుడు సంతోషించి చెప్పాడు.

సీ. వినుఁడు నృపాల నందనులార! మీ మదిఁ–
గల తలం పెల్లను గానవచ్చె;
మీకు భద్రం బగు; మీ యెడ నే నను–
గ్రహబుద్ధిచే నిటు గానఁబడితిఁ;
గైకొని యిపుడు సూక్ష్మముఁ ద్రిగుణాత్మక–
ము నగు నా ప్రకృతికంటెను ధరణిని
బరఁగు జీవుని కంటెఁ బరుఁడైన వాసుదే–
వుని చరణాబ్జముల్ దనరు భక్తి [4-698]

తే. నర్థి నెవ్వరు భజియింతు రట్టివారు
నాకుఁ బ్రియతముల్; వారికి నయచరిత్రు
లార! యేను బ్రియుండనై భూరిమహిమ
వెలయు చుండుదు; నది గాక వినుఁడు మీరు. [4-698.1]

మీరు తపస్సు చేయబోతున్నారనే కోరిక నాకు తెల్సింది. మీమీద అనుగ్రహంతో ఇలా కనిపించాను. సూక్ష్మం త్రిగుణాత్మకం అయిన నా ప్రకృతి కంటే ప్రసిద్ధుడైన వాసుదేవుణ్ణి భజించేవారు నాకు ప్రియులు. అందువల్ల దీక్ష ఇవ్వడానికి వచ్చాను, వినండి. శివుడు ఇచ్చిన దీక్షతో వీళ్ళు ఏం చేసారో, వీళ్ళు తపస్సుకి వెళ్ళాక వీరి తండ్రి ప్రాచీనబర్హి కి ఏమైందో వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS